# తారాబాయి నృత్యం

సిరిపురం పేరుకి తగినట్లే సిరిసంపదలతో తుల తూగుతూ వుంది. ఆ పరగణాలో సిరిపురం నుంచే ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం వస్తూ వుండేది. అయితే గత కొన్ని సంవత్సరాల నుంచి సిరిపురం నుంచి వసూలయ్యే పన్నులు తగ్గి పోవడం గమనించిన అధికారులు కారణం తెలుసుకుని రమ్మని తాశీల్దారుని తనిఖీకి పంపించారు.

గ్రామాధికారులు తాశీల్దారుకి స్వాగతం పలికి అతిథి మర్యాదలు చేశారు.

"గత కొద్ది సంవత్సరాలుగా మీ గ్రామం నుంచి వసూలయ్యే పన్నులు తగ్గిపోతున్నాయి. కారణం ఏమిటి? పన్నులు సరిగా వసూలు కావడం లేదా? లేదా వసూలు చేసిన పన్నులు ఖజానాకు జమకట్టడం లేదా?" అని ప్రశ్నల వర్షం కురిపించాడు తాశీల్దారు.



"మీ అనుమానాలు నిజం కావు మహా ప్రభూ! సిరిపురం చెరువు ఈ పరగణాలోనే పెద్దది. ఈ చెరువు కింద వేల ఎకరాలు సాగవుతున్నాయి. వర్షాలు కూడా సకాలంలోనే కురుస్తున్నాయి. అయితే చెరువు పూడుకు పోయింది. నీళ్ళు నిలవడం లేదు. పూడిక తీయించి, గట్టు ఎత్తు చేయిస్తేగాని చివరి భూములకు నీళ్ళు అందవు. గత కొద్ది ఏళ్ళుగా చివరి భూములకు నీళ్ళు అందక పంటలు పండడం లేదు. పంటలు పండని చిన్నకారు రైతులు కూలీలుగా మారి పోతున్నారు. పంట దిగుబడి తగ్గిపోవడం

వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం తగ్గిపోయింది" అని గ్రామాధికారులు తాశీల్దారుకి వివరంగా చెప్పారు.

"సిరిపురానికి అన్నపూర్ణలాంటి చెరువు ఎండిపోతుంటే గ్రామంలో పెద్దలంతా ఏం చేస్తున్నారు? తలా కాస్త చందాలు వేసుకుని చెరువుకి మరమ్మతులు చేయించుకోవచ్చు గదా?" అని ప్రశ్నించాడు తాశీల్దారు.

"ఆ ప్రయత్నమూ చేశాం ప్రభూ! ఊళ్ళో వ్యాపారస్తులు ఎవరూ మాట్లాడడం లేదు. ఇక పెద్ద పెద్ద భూస్వాములు బావులు తవ్వించుకుని వాళ్ళ పొలాలు పండించుకుంటున్నారు. ఇక చెరువు గురించి ఎవరు పట్టించుకుంటారు? చెరువుని బాగుచేయించుకోవాలని వున్నా చిన్న రైతుల దగ్గర ధనం లేదు. ఊరి బాగు ఎవరూ చూడడం లేదు. అంతా స్వార్థపరులైపోయారు ప్రభూ! ఈ పరిస్థితులలో తమరే పట్టించుకోవాలి" అన్నారు గ్రామాధికారులు.

"సరే! మీరు హైదరాబాద్ నవాబుగారికి విజ్ఞప్తి చేస్తూ మహాజరు పట్టుకురండి. నేను నా ప్రయత్నం చేస్తాను. ప్రభుత్వమే చెరువు మరమ్మతులు చేయించే ఏర్పాటు చేస్తాను. ఊళ్ళో ప్రజలందరి సంతకాలు చేయించి ఒక వారం రోజుల్లో హైదరాబాద్ రండి. నన్ను కచ్చేరిలో కలుసుకోండి" అన్నాడు తాశీల్దారు.

తాశీల్దారు ఇచ్చిన హామీతో గ్రామాధికారులు, చిన్న రైతులు సంతోషించారు. సిరిపురం చెరువు మరమ్మతు చేయించవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ నవాబుగారికి మహాజరు తయారుచేసి గ్రామ ప్రజలతో సంతకాలు చేయించి హైదరాబాద్ వెళ్ళారు గ్రామాధికారులు.

అయితే అక్కడ తాశీల్దారు ద్వారా చేసిన ప్రయత్నం విఫలమైంది. హైదరాబాద్ నవాబు ఖజానాలో డబ్బు లేదు. ఉద్యోగుల జీతభత్యాలకు అంతఃపురం ఖర్చులకు ప్రభుత్వానికి వచ్చే ఆదాయం సరిపోతున్నది. పులిమీద పుట్రలాగా నవాబుని ఇంగ్లీషువాళ్ళు లొంగ దీసుకుని కప్పం కట్టమని వత్తిడి చేస్తున్నారు. 40 లక్షల రూపాయిలు నవాబు ఇంగ్లీషువారికీ బాకీపడ్డాడనీ, రేపోమాపో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, బళ్ళారి జిల్లాలను నవాబు వారికి దారాదత్తం చేయబోతున్నాడనీ హైదరాబాద్‌లో పుకారు పుట్టింది. ఈ పరిస్థితులలో చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం ధనం కేటాయించలేదని అధికారులు స్పష్టంగా చెప్పేశారు.

సిరిపురం గ్రామస్థులు, అధికారులు దిగులు పడ్డారు. ఇట్లాగే వూరుకుంటే చెరువు ఎండిపోతుంది. పొలాలు బీళ్ళవుతాయి. బీద రైతులు పరాయి ఊళ్ళకు వలసపోతున్నారు. సిరిపురం చిన్నబోతుంది.

"మీరిట్లా దిగులుపడితే ఎలా? ఉపాయంతో అపాయం తప్పించుకోవాలి" అన్నాడు తాశీల్దారు.

"ఇది ఉపాయంతో తప్పుకునే అపాయం కాదు. డబ్బు లేనిదే పని జరగదు" నిరాశతో అన్నారు గ్రామాధికారులు.

"డబ్బు కూడా ఉపాయంతోనే వస్తుంది. నేను చెప్పినట్లుచేయండి. దసరాఉత్సవాల సందర్భంగా దేవి ఆలయంలో తారాదేవి నృత్య ప్రదర్శన వుంటుంది. వ్యాపారస్తులు, భూస్వాముల దగ్గర తలా వంద రూపాయిలు వసూలు చేయండి. హైదరాబాద్ నుంచి మంత్రిగారు కూడా వస్తారని చాటింపు వేయండి" అన్నాడు తాశీల్దారు.

"అందువల్ల మాకు ఒరిగేదేముంది? వసూలైన డబ్బు తారాదేవికి, ఆమె వాయిద్యగాళ్ళకి, చెలికత్తెలకు సరిపోతుంది."

"నేను చెప్పినట్లు చేయండి. తర్వాత అంతా మీకు తెలుస్తుంది" అన్నాడు తాశీల్దారు.

దసరా ఉత్సవాలకు హైదరాబాద్ నుంచి తారాదేవి వస్తుందనీ, దేవీ ఆలయంలో నృత్యం చేస్తుందనీ, మంత్రిగారు వేంచేస్తున్నారనీ సిరి పురంలో బాగా ప్రచారం జరిగింది. ముందు వరసలో ఆసనాలలో కూర్చోవడానికి ధనవం తులు, భూస్వాములు పోటీలు పడి తలా వంద రూపాయిలు ఇచ్చారు.

దసరా రానే వచ్చింది. ఉత్సవాల ముగింపు రోజు కూడా తారాబాయి రాలేదు. హైదరాబాద్ నుంచి తాశీల్దారు మాత్రమే వచ్చాడు. తారా బాయికి జబ్బు చేసిందని, అందువలన రాలేక పోయిందనీ ప్రకటించాడు.

"గ్రామ పెద్దలారా! తారాబాయి ఇప్పట్లో వచ్చే అవకాశాలు లేవు. అందువలన మీ నుంచి గ్రామాధికారులు వసూలు చేసిన డబ్బు ఒక సత్కార్యానికి వినియోగిస్తే బాగుంటుందని అను కుంటున్నాను. ఏమంటారు?"అన్నాడు తాశీల్దారు.

"మీ ఇష్టం!" అన్నారు కొందరు. చాలా మంది ఏమీ మాట్లాడలేదు. తమ డబ్బు ఇస్తే బాగుంటుం దనుకున్నారు. కానీ తాశీల్దారు ముందు నోరు మెదపలేక పోయారు.

"మీ అందరికీ తెలిసిన విషయమే. సిరిపురం చెరువు అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందింది. వందల ఏళ్ళ నుంచి ఈ గ్రామానికే సిరిసంపదలు పంచుతూ వున్న చెరువు ఇప్పుడు పూడుకు పోతున్నది. చెరువు బాగుచేయించే బాధ్యత ప్రభుత్వానిదే అయినా, ప్రస్తుత పరిస్థితులలో నిధులు లేవు. మనం చూస్తూ వూరుకుంటే చెరు వులో చుక్క నీరు నిలవదు. కాబట్టి తారాబాయి నృత్యానికి వసూలైన ధనంతో చెరువు మర మ్మతులు చేయించవలసిందిగా గ్రామాధికారుల్ని కోరుతున్నాను" అన్నాడు తాశీల్దారు.

అందరూ హర్షధ్వానాలు చేశారు. ఆ ఎండా కాలంలో చెరువుకి పూడిక తీయించి ఎత్తుగా గట్టు పోయించారు. వర్షాకాలంలో చెరువు నిండింది. పంటకాలువల ద్వారా ఊళ్ళోని చివరి భూములకు సయితం నీరు పారింది. పంటలు పుష్కలంగా పండాయి.

తర్వాత ఒకసారి జమాబందుకు తాశీల్దారుని కలుసుకున్నారు గ్రామస్థులు.

"పన్నులు బాగా వసూలయ్యాయి. ఇదంతా మీ చలువే" అని తాశీల్దారుని మెచ్చుకున్నారు.